క్లుప్తంగా

మిత్రుడికి చేయూత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని లాండేరి రాజేందర్‌కు 1995–96 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఆర్థిక చేయూత అందించారు. రాజేందర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో క్లాస్‌మేట్స్ అందరు కలిసి రూ.27 వేలు పోగేశారు. ఆదివారం రాజేందర్ ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు.

ఎమ్మెల్యే షకీల్ విరాళం



బోధన్: నవీపేట మండలలోని పోతంగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్, శివాలయం నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ రూ.లక్ష విరాళం అందించారు. శనివారం హైదరాబాద్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యేను గ్రామ ప్రజాప్రతినిధులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కలిశారు. డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, పోతంగల్ గ్రామ సర్పంచ్ రవీందర్‌రావు, సొసైటీ డైరెక్టర్‌లు శ్రీనివాస్, హరీష్, తదితరులున్నారు.

శివకుమార్‌కు డాక్టరేట్



బోధన్: తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన జంగం శివకుమార్‌కు జ్యోతిష్యం(ఆస్ట్రాలజీ) విభాగంలో డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. శనివారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్‌లో ఆయన డాక్టరేట్ పట్టాను ఆ యూనివర్సిటీ ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. శివకుమార్ వృత్తిరీత్యా అర్చకుడు, జ్యోతిష్యం విద్యను అభ్యసించి మంచి పట్టును సాధించాడు. డాక్టరేట్ పట్టా రావడం ఎంతో సంతోషంగా ఉందని శివకుమార్ తెలిపారు.

మహేశ్‌కు అభినందనలు



బోధన్: ఇటీవల విడుదలైన సివిల్స్–2022 తుది పరీక్ష ఫలితాల్లో బోధన్‌కు చెందిన కంఠం మహేష్ కుమార్ ఆలిండియా 200 ర్యాంక్ సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎరాజ్‌పల్లి గ్రామస్తులు మహేష్ కుమార్ – సౌమ్య దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతు బోధన్ గడ్డపై జన్మించి ఉన్నత స్థానానికి ఎదిగి ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం ఎంతో సంతోషకరంగా ఉందని పేర్కొన్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే ఏదైనా లక్ష్యం సాధించవచ్చని అన్నారు. గ్రామస్తులు కమ్మరి శ్రీనివాస్, పాషా బాయ్, కమలవార్ నవీన్ కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయానికి గురువులే కారణం



బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థులు ఉన్నత విజయాలు సాధించడానికి గురువులే కారణమని ఎంఈవో నాగనాథ్ అన్నారు. కొత్త బస్టాండ్ సమీపంలో 10వ తరగతి విద్యార్థులకు ఓవర్‌సీస్ ఉచిత వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎంఈవో మాట్లాడారు. రుద్రూర్ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, దత్త వరప్రసాద్ ఆర్థిక సహాయంతో 10వ తరగతి విద్యార్థులకు ఓవర్‌సీస్ ఉచిత వేసవి శిక్షణ నెల రోజుల పాటు అందించారని, ఈ శిబిరంలో గణితం, ఇంగ్లీష్, సామాన్య శాస్త్ర సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 10వ తరగతి అనంతరం విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఈ మూడు సబ్జెక్టుల్లో పూర్తి స్థాయిలో అవగాహన ఉండటం అవసరమన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఈ వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో గణితం, ఇంగ్లీష్, సామాన్య శాస్త్రం బోధించిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, ఇందూర్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ కొడాలి కిశోర్ కుమార్, విద్యావికాస్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, బచ్చు రాము పాల్గొన్నారు.

లారీలు రావు.. బస్తాలు పోవు

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకు పోయిన ధాన్యం నిల్వలు
- పట్టించుకోని అధికారులు
- కేంద్రాల నుంచే ఇతరులకు అమ్ముకుంటున్న రైతులు



రెంజర్లలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

బాల్కొండ : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు రావడం లేదు.. బస్తాలు పోవడం లేదు. దీంతో రోజుల తరబడి రైతులు ధాన్యం బస్తాల దగ్గర కాపలా కాస్తున్నారు. ముప్కాల్ మండల పరిధిలో వేంపల్లి, రెంజర్ల సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాని సకాలంలో కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెంజర్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత తీవ్రంగా ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ హమాలీలకు రైతులు చెల్లిస్తున్న దాంట్లో నుంచే అధికారులు కక్కుర్తి పడటం వల్లనే హమాలీలు వెళ్లిపోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు కుప్పలుగా పేరుకుపోయాయి. మరో వారం రోజులు గడిస్తే మృగ శిర కార్తె వస్తుంది. దీంతో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా బస్తాలు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరుగు పేరిట 10 కిలోల కడ్తా తీస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. ధాన్యం కాంటా అయితే చాలని రైతులు అంటున్నారు. కాని అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

కేంద్రాల నుంచే వ్యాపారులకు విక్రయం

కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు తప్పని పరిస్థితుల్లో వ్యాపారులకు కేంద్రాల వద్దనే విక్రయించుకుంటున్నారు. క్వింటాలుకు రూ.1750లకు వ్యాపారులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.300 నష్టం వస్తున్నా వ్యాపారులకే విక్రయించుకుంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే ధాన్యం బస్తాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

నెల రోజులవుతోంది



ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి నెల రోజులు అవుతోంది. ఇప్పటికీ వడ్ల బస్తాలు పోవడంలేదు. ఎప్పుడు పోతాయో కూడా చెప్పడం లేదు. ఇది వరకే రెండు సార్లు వర్షాలు పడి తడిసి పోయాయి. ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాల్లో అర్థం కావడం లేదు.

– రాజలింగం, రైతు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తూ కాలనీని పరిశుభ్రంగా ఉంచుకుంటూ జర్నలిస్ట్ కాలనీవాసులు ఆర్మూర్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కాలనీలో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. కౌన్సిలర్ వనం శేఖర్, జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళులు



వర్నిలో నివాళులర్పిస్తున్న అభిమానులు

రుద్రూర్/వర్ని/బాల్కొండ : సినీ నటుడు, మాజీ సీఎం ఎన్‌టీఆర్ శత జయంతిని కమ్మ సంఘం, టీటీడీపీ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. పలు చోట్ల పండ్లు పంపిణీ చేశారు. అన్నదానాలు చేశారు.



రుద్రూర్‌లో.. కమ్మ సంఘం నేతలు



ముప్కాల్ మండల కేంద్రంలో ..

చేసే పనిలో నాణ్యత ఉండాలి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గంగారాం

రుద్రూర్: చేసే పనిలో నాణ్యత ఉండాలని జెడ్పీటీసీ నరోజి గంగారాం అన్నారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ నుంచి చిక్కడపల్లి క్యాంపు వరకు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. లక్షల రూపాయలతో చేపడుతున్న పనులు దీర్ఘకాలంగా మన్నికతో ఉండేటట్లు నిర్మించాలని సూచించారు. నాణ్యత లోపిస్తే బిల్లులు రికవరీ చేస్తామని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ గౌస్, విండో డైరెక్టర్ రాజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- గాయాలపాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బల్దియా పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. రాకాసీపేట్‌లోని వాటర్ వర్క్స్ ప్రాంతంలో ఒకే రోజు నలుగురిపై దాడిచేసి గాయ పరిచాయి. గడిచిన రెండు రోజుల్లో పట్టణంలోని రాకాసీపేట్, శక్కర్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్ కాలనీల్లో మొత్తం ఏడుగురిపై దాడి చేశాయి. ఇందులో సుభాని అనే వ్యక్తిని అతిదారుణంగా మొహంపై దాడిచేసి కరవడంతో తీవ్ర గాయాలపాలైన సుభాన్‌ను బోధన్ జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించిన ఘటనలు నెలకొన్నాయి. పదే, పదే కుక్కల నియంత్రణ చేపట్టాలని ప్రజలు, బల్దియా అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పట్టణ శివారు వార్డుల్లోకి రాత్రి వేళలలో వెళ్లాలంటే అయా కాలనీలవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

పట్టణంలోని వార్డుల నుండి ప్రతీ రోజు కుక్కల దాడిలో గాయాల పాలైన వారు ఇద్దరు లేక ముగ్గురు ఉంటున్నారు. జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజూ 2 నుంచి 3 కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పట్టణంలోని 1వ వార్డు ఆచన్‌పల్లిలో ఇటీవల మహిళపై దాడిచేసి గాయపరచగా, సరస్వతినగర్ కాలనీలో సైతం పలువురిని కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటనలు నెలకొన్నాయి.

అధికారులు స్పందించాలి..

పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత బల్దియా అధికారులపై ఉంది. ప్రతీ రోజూ ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నా బల్దియా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు చేపడతాం



బల్దియా పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతాం. రాకాసీపేట్ కాలనీలో పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ దాడి చేస్తోంది. దీంతో పాటు వీధి కుక్కల నియంత్రణపై ఇప్పటికే ఉన్నత అధికారులకు నివేదిక అందించాము. సోమ, మంగళవారాల్లో క్యాచింగ్ టీమ్స్ వస్తున్నాయి. కుక్కలను పట్టుకుని వాటికి స్టెరిలైజేషన్ చేసే చర్యలు చేపడుతున్నాం. – ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

నిర్దేశించుకున్న లక్ష్యం కోసం కష్టపడాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం కోసం కష్టపడాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం భవనంలో ఆదివారం విశ్వ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. 31 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. అలాగే సంఘం సభ్యులు ఏసీపీ కిరణ్ కుమార్‌ను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు గద్దె గంగాధర్, జిల్లా కార్యదర్శి రాజారాం, తదితరులున్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



బోధన్‌రూరల్(బోధన్): బోధన్‌లో వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం 35వ రోజు వీవోఏలు పట్టణంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ నిరసనలో వీవోఏల అసోసియేషన్ ప్రతినిధులు, వీవోఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్‌కు శాశ్వత ఓటు బ్యాంకు



రుద్రూర్: గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి శాశ్వత ఓటు బ్యాంకు ఉందని పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మోస్రా మండల కేంద్రంలో ఆదివారం పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ బలహీనంగా లేదని, నిరుత్సాహాన్ని వీడి బలోపేతం చేయడానికి నడుం బిగించాలని నాయకులకు సూచించారు. సాధారణ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. మోస్రా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్మీర్‌కర్ లక్ష్మణ్, నాయకులు హరినారాయణ, విశ్వనాథం పాల్గొన్నారు.

గోదావరి హారతి యాత్రకు ఏర్పాట్లు



రెంజల్(బోధన్): తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నది తొలి ప్రవేశ ప్రాంతమైన రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో గోదావరి హారతి యాత్రకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కూలీలు, జేసీబీలతో ఘాట్లపై పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగిస్తున్నారు. వచ్చే నెల 3 నుంచి గోదావరి నదీ పరివాహక పుష్కరక్షేత్రాల్లో గోదావరి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో యాత్ర చేపడుతున్నారు. కందకుర్తిలో మొదట గంగాహారతితో ప్రారంభమై బాసర, గొమ్మిర్యాల్, ధర్మపురి, కాళేశ్వరం, రామన్నగూడెం మీదుగా చివరకు 8న భద్రాచలం చేరుకుంటుంది. బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొనే గంగాహారతికి సన్నాహాలు జరుగుతున్నాయి.

దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్: వచ్చే నెల 2 నుంచి నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేల్పూర్ రైతు వేదికలో నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 రోజుల పాటు జరుపుకునే ఉత్సవాలపై కూలంకషంగా చర్చించారు. రాష్ట్రం సాధించిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలు గ్రామ గ్రామాన వివరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలు కచ్చితంగా చెప్పుకోవాలని, మౌనంగా ఉండాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీవో సింహాచలం, ఏసీపీ ప్రభాకర్, తహసీల్దార్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పక్కన వీజీగౌడ్, ఆకుల లలిత

ఆధ్యాత్మికం..

అలరించిన ఎల్లమ్మ శోభాయాత్ర



నవీపేట: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ, పుట్ట ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలలో భాగంగా ఆదివారం వేయి కళ్ల ఎల్లమ్మ శోభాయాత్ర నిర్వహించారు. సాంప్రదాయబద్దంగా కుమ్మరి కొలువు నుంచి ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సాయిబాబా గౌడ్, ఎంపీపీ రాజేంద్ర కుమార్ గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు రామాగౌడ్, మంత్రి గంగాధర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ దేవి ఆలయంలో ఈ నెల 29 నుంచి 31 వరకు మహా లక్ష్మీదేవి, వీరభద్ర బలిపీట ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాలకు లింగేశ్వర గుట్ట బాలయోగి కృష్ణ మహరాజ్ హాజరై భక్తులకు ప్రవచనం ఇస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లికి బోనాలు



రెంజల్(బోధన్): మండల కేంద్రంతో పాటు నీలా గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాజాభజంత్రీలతో ఆలయాలకు వెళ్లి బోనాలు అందించారు. రెంజల్‌లో 11వ, నీలాలో 3వ వార్షికోత్సవాలను నిర్వహించారు. వేడుకల సందర్భంగా బంధువులను ఇళ్లకు పిలిపించుకుని వేడుకలను పంచుకున్నారు. రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, వైస్ ఎంపీపీ యోగేశ్‌లతో పాటు కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగింపు ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా వీరసావర్కర్ జయంతి

ఆర్మూర్‌టౌన్: బీజేపీ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్ 140వ జయంతి వేడుకలను ఆర్మూర్ పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. వీర సావర్కర్ జయంతి రోజున, ప్రజాస్వామ్య దేవాలయం అయిన నూతన పార్లమెంటు భవనాన్ని గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించడాన్ని హర్షిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోదీని

విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. నాయకులు బొట్ల విజయ్, ద్యాగ ఉదయ్, కర్తన్ మధు, విజయానంద్, కౌన్సిలర్ బ్యావత్ సాయికుమార్, తోపారం పోశెట్టి, కిరణ్, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సమాచారం..

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నిక



డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా బైండ్ల శ్రీనివాస్ (శ్రీకాంత్, ఎంపీటీసీ) ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షులు దీకొండ యాదగిరి ఆధ్వ ర్యంలో ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గానికి ప్రమాణస్వీకారం నిర్వహించారు. అలాగే మండల బాడీకి ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిలుక శ్రీనివాస్, కోశాధికారిగా రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా విఠల్, మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు ప్రకటించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

- స్క్రీన్-1 – ఫాస్ట్ ఎక్స్ (తెలుగు) 10.30, 4.10, 7.10; గ్రే: ది స్పై హు లవ్డ్ మీ (తెలుగు) 1.30; 2018 (తెలుగు) – 10.10 (రాత్రి)
- స్క్రీన్-2 – బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00
- స్క్రీన్-3 – మేమ్ ఫేమస్ – 10.30, 4.30, 10.30; మళ్లీ పెళ్లి – 1.40, 7.40
- స్క్రీన్-4 – మెన్‌టూ (తెలుగు) – 12.20, 9.15; 2018 (తెలుగు) – 3.05; ది కేరళ స్టోరీ (తెలుగు) – 6.15